కరెంట్ కోతలపై ఆందోళన

- కాంగ్రెస్ ఆధ్వర్యంలో సాలూరాలో రహదారిపై ధర్నా
- భారీగా ట్రాఫిక్ జాం
- ఉదయం 5 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కరెంట్ ఇవ్వాలని వినతి


సాలూరాలో అంతర్రాష్ట్ర రహదారిపై ధర్నా నిర్వహిస్తున్న రైతులు, కాంగ్రెస్ నేతలు

బోధన్ రూరల్ (బోధన్) : వ్యవసాయానికి అందించే కరెంటుపై కోతలు విధించడంపై అన్నదాతలు ఆందోళన చేపట్టారు. శుక్రవారం సాలూర అంతర్రాష్ట్ర రహదారిపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అన్నదాతలు ధర్నా నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు నాయకులు, రైతులు మాట్లాడుతూ..ప్రస్తుతం వరిలో కలుపు తీస్తున్న నేపథ్యంలో కరెంటు కోతలు విధించడం వల్ల పంటల సాగుకు ఇబ్బంది కలుగుతుందన్నారు. కరెంటు కోతలపై విద్యుత్ శాఖ అధికారులకు పలు మార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి కోతలు లేకుండా ఉదయం 5 నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. ఏసీడీ చార్జీలను సైతం రద్దు చేయాలని కోరారు. రైతుల ఆందోళనతో అంతర్రాష్ట్ర రహదారిపై భారీగా ట్రాఫిక్ జామైంది. దీంతో బోధన్ రూరల్ పోలీసులు అక్కడ చేరుకుని రైతులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు. ఈ సందర్భంగా రైతులు, విద్యుత్ శాఖ అధికారులకు వినతి పత్రం అందజేశారు.

కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గంగా శంకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ నరేందర్ రెడ్డి, కిసాన్ సెల్ మండల అధ్యక్షుడు మందర్న రవి, సాలూర క్యాంప్ సర్పంచ్ శ్రీనివాసరావు, యూత్ కాంగ్రెస్ నాయకులు షేక్ ఫరానా, ఖాజాపూర్ అశోక్, మాజీ ఎంపీటీసీలు చీల శంకర్, తగ్గెల్లీ దేవ్ రావు, ఇల్తెపు రమేష్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అగ్ని ప్రమాద బాధితులకు బీజేపీ చేయూత



కమ్మర్‌పల్లి: హాసాకొత్తూర్‌లో 4 రోజుల క్రితం షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం సంభవించి ఇల్లు దగ్ధం అయిన పెద్ది నారాయణ కుటుంబానికి బీజేపీ చేయూత అందించింది. శుక్రవారం బీజేపీ నాయకులు బాధిత కుటుంబం ఇంటికి వెళ్లి పార్టీ తరఫున రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు కట్ట సంజీవ్ కుమార్, ఉపాధ్యక్షుడు సంత లింగారెడ్డి, నాయకులు గోపిడి శేఖర్, నవీన్, తెడ్డు రాజేశ్వర్, సృజన్ పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



భీమ్‌గల్: బాబాపూర్, బాబానగర్, మెండోరా గ్రామాల్లో శుక్రవారం అర్హులైన లబ్ధిదారులకు జెడ్పీటీసీ చౌట్‌పల్లి రవి ఆధ్వర్యంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ చౌట్‌పల్లి రవి మాట్లాడుతూ.. అత్యవసర పరిస్థితుల్లో ప్రయివేటు ఆస్పత్రిలో చికిత్స పొందిన పేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో భరోసా ఇస్తుందన్నారు. పంపిణీ కార్యక్రమంలో బీఆర్ఎస్ అధ్యక్షుడు దొన్కంటి నర్సయ్య, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దోమల బెడద అరికట్టాలి

రుద్రూర్: మండల కేంద్రంలోని జవహర్‌నగర్ కాలనీలో దోమల బెడద అధికమైందని కాలనీవాసులు వాపోతున్నారు. పశువుల పాకలు, డ్రైనేజీల వద్ద వృద్ధి చెంది రాత్రి వేళల్లో నిద్ర రాకుండా చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో అనారోగ్యం పాలవుతున్నామని, జీపీ సిబ్బంది దృష్టి సారించి దోమల నివారణ మందు పిచికారీ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

మార్కెట్ పనుల పరిశీలన



బోధన్‌టౌన్(బోధన్): పట్టణంలోని శక్కర్‌నగర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న సమీకృత వెజిటబుల్ మార్కెట్ భవన నిర్మాణ పనులను మున్సిపల్ డీఈ లింగంపల్లి శివానందం పరిశీలించారు. పనులలో నాణ్యతా లోపం ఉండకుండా చూడాలని, నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. డీఈ వెంట ఏఈ శివకృష్ణ, సత్తార్ ఉన్నారు.

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోండి



మోర్తాడ్: విద్యార్థి దశలోనే జీవిత లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని మోర్తాడ్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పెద్దన్న సూచించారు. శుక్రవారం మొదటి సంవత్సరం విద్యార్థులకు ఫ్రెషర్స్ డేను నిర్వహించగా ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడారు. విద్యార్థులు చదువుపై దృష్టి సారించి పోటీ పరీక్షలకు ఇప్పటి నుంచే ప్రిపేర్ కావాలని సూచించారు. ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకుని సాధించడానికి కృషి చేయాలన్నారు. సోషల్ మీడియాను మంచికి ఉపయోగించుకోవాలని తెలిపారు. నృత్య ప్రదర్శనలో ప్రతిభకనబరిచిన వారికి బహుమతులను ప్రదానం చేశారు.

రూ.500 కోట్లు కేటాయించాలి

తెయూ(డిచ్‌పల్లి): రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్‌లో తెలంగాణ యూనివర్సిటీకి రూ.500 కోట్ల నిధులు కేటాయించాలని భారతీయ విద్యార్థి మోర్చా(బీవీఎం) రాష్ట్ర కార్యదర్శి జీవీఎం విఠల్ డిమాండ్ చేశారు. తెయూ క్యాంపస్‌లో శుక్రవారం ఆయన మాట్లాడారు. వర్సిటీలో ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్-టీచింగ్ పోస్టులను భర్తీ చేయాలని, బాలికలకు నూతన వసతి గృహం నిర్మించాలన్నారు. పీజీ విద్యార్థులకు రూ.3వేల చొప్పున ఫెలోషిప్ ఇవ్వాలన్నారు. ఇప్పటివరకూ జరిగిన యూనివర్సిటీ అభివృద్ధిపై వీసీ శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

కంటి వెలుగు శిబిరం పరిశీలన


పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి శశికళ

రుద్రూర్ : మండల కేంద్రంలో నిర్వహిస్తున్న కంటి వెలుగు శిబిరాన్ని శుక్రవారం మండల ప్రత్యేకాధికారి శశికళ సందర్శించారు. కంటి పరీక్షలు చేస్తున్న విధానాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కంటి పరీక్షల కోసం నిర్వహిస్తున్న సూక్ష్మ ప్రణాళిక గురించి వైద్యాధికారి ఆయేషా సిద్ధికాను ప్రశ్నించారు. ఇప్పటి వరకు 1441 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 354 మందికి దగ్గరి చూపు లోపం ఉన్నట్టు గుర్తించి అద్దాలు అందచేశామని డాక్టర్ వివరించారు. 61 మందికి భేదాత్మక దృష్టిలోపం ఉన్నట్టుగా గుర్తించి కళ్లద్దాల కోసం ఆర్డర్ చేశామన్నారు. 342 మందికి శుక్లం, నలుగురికి మెల్లకన్ను, 20 మందికి టెరీజియమ్, ఏడుగురికి కార్నియా వ్యాధి ఉన్నట్టుగా నిర్ధారించినట్టు వివరించారు. శస్త్ర చికిత్సల నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి సిఫార్సు చేసినట్టు పేర్కొన్నారు. ఎంపీడీవో బాల గంగాధర్, శిబిరం కో-ఆర్డినేటర్ సుమతి, తదితరులు ఉన్నారు.

పనులు ఆలస్యమైతే కఠిన చర్యలు


అధికారితో మాట్లాడుతున్న ప్రజాప్రతినిధులు

కోటగిరి: మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో కొనసాగుతున్న మన ఊరు- మన బడి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ఆలస్యమైతే ఆ పనులు జరిగే ప్రాంతాల్లో బాలబాలికలకు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, మండల స్పెషల్ ఆఫీసర్ రమేష్ హెచ్చరించారు. శుక్రవారం మండల కేంద్రంలోని హైస్కూల్ ఆవరణలో కొనసాగుతున్న వాటర్ సప్లయ్ సంప్ హౌజ్‌ను రమేష్‌తో పాటు ఎండీవో మనోహర్ రెడ్డి, ఎంఈవో నాగనాథ్ కలిసి పరిశీలించారు. సంప్ హౌజ్‌లో పిల్లలు పడిపోయే ప్రమాదం ఉన్నందున త్వరగా పూర్తి చేయాలని స్థానిక ఎంపీటీసీ కొట్టం మనోహర్ స్పెషల్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేశారు. పోతంగల్, కోటగిరి ఉభయ మండలాల్లో కలిపి సుమారు 75 శాతం పనులు పూర్తయ్యే దశకు చేరుకున్నాయని, ఎంబీ రికార్డుల నమోదు పూర్తయిన వాటికి నిధుల కొరత లేదని రమేష్ వెల్లడించారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు


దీక్షలో కూర్చున్న మహిళా సంఘం సభ్యులు

బోధన్: బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం నాటికి 47వ రోజుకు చేరాయి. దీక్షలో రుద్రూర్ మండల కేంద్రానికి చెందిన బహుజన స్త్రీశక్తి మహిళా సంఘం సభ్యులు సోనీ, లక్ష్మి , నాగమణి, గీత, గంగామణి, చంద్రబాయి, సునీతలు కూర్చున్నారు. న్యాయవాది కల్యాణి దీక్షలను ప్రారంభించారు. ప్రత్యేక జిల్లా సాధన పోరాటంలో భాగంగా శనివారం మధ్యాహ్నం 12 గంటలకు పట్టణ కేంద్రంలో మోటార్ బైక్ ర్యాలీ నిర్వహించనున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గంగారెడ్డి తెలిపారు.

వరిలో సస్యరక్షణ చర్యలు తప్పనిసరి


పరిశీలిస్తున్న అధికారి తిరుమల ప్రసాద్

నందిపేట్(ఆర్మూర్): వరిలో సస్యరక్షణ చర్యలు కచ్చితంగా చేపట్టాలని జిల్లా వ్యవసాయాధికారి తిరుమల ప్రసాద్ సూచించారు. వెల్మల్ శివారులోని వరి పైరును క్షేత్ర పరిశీలన చేశారు. ఈ సందర్భంగా వరి పిలకదశలో ఉన్నందున కాండం తొలిచే పురుగు ఆశిస్తుందన్నారు. దీని నివారణకు ఎకరాకు కార్బోఫ్యూరాన్ 3జీ గుళికలు 10 కిలోలు లేదా కార్బో హైడ్రోక్లోరైడ్ 4జీ గుళికలు 8 కిలోల వేయాలని లేదా కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్‌పీ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. విద్యుత్ కోతలు, పైరు పరిస్థితి గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. మండల వ్యవసాయాధికారి జ్యోత్స్న భవాని పాల్గొన్నారు.

విద్యార్థినులకు కరాటే శిక్షణ



పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మండలం మంథని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు ఆత్మరక్షణ కోసం శుక్రవారం కరాటే మాస్టర్ భోజన్న శిక్షణ ఇచ్చారు. బాలికల దినోత్సవం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినుల కోసం రాణి లక్ష్మీబాయి ఆత్మరక్షణ ప్రశిక్షణ్ కార్యక్రమాన్ని చేపట్టింది. దీంతో పాఠశాలలో విద్యార్థినులకు ఆత్మరక్షణ కోసం శిక్షణ ఇస్తున్నారు. హెచ్‌ఎం శ్యామలాబాయి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ వివాదం


ఎడపల్లి: జానకంపేట శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయ జాతర విషయంలో ప్రొటోకాల్ వివాదాస్పదమైంది. గ్రామ ప్రథమ పౌరుడు, సర్పంచ్ అయిన తనకు ఆహ్వానం అందలేదని పాట్లోళ్ల సాయిలు అన్నారు. ఈ విషయం గురించి సంబంధిత ఆలయ సిబ్బందిపై జిల్లా కలెక్టర్, దేవాదాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తారని సర్పంచ్ చెప్పారు.

సమాచారం..

6న మైనారిటీ రుణాల కోసం ఇంటర్వ్యూలు

కమ్మర్‌పల్లి: మైనారిటీ కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తుదారులకు ఈ నెల 6న ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సంతోష్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు అభ్యర్థులు ధ్రువపత్రాలతో రావాలని కోరారు.

దురుసుగా ప్రవర్తించొద్దు


మాట్లాడుతున్న జిల్లా ఆర్ఎం ఉషాదేవి

ఆర్మూర్‌టౌన్: ఆర్టీసీ బస్‌లలో ప్రయాణించే ప్రయాణికులతో డ్రైవర్లు మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని జిల్లా రీజినల్ మేనేజర్ ఉషాదేవి అన్నారు. 'మర్యాద, సురక్షిత డ్రైవింగ్' కార్యక్రమంలో భాగంగా రెండో రోజు శుక్రవారం ఆర్మూర్ డిపోలో బస్ డ్రైవర్ల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. చలికాలంలో పొగమంచు కారణంగా రోడ్డు ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. సీనియర్ డ్రైవర్లను సన్మానించారు. ఆర్టీసీ డిపో మేనేజర్ కవిత, ఆఫీస్ సూపరింటెండెంట్ పృథ్వీరాజ్, అహ్మద్ ఉన్నారు.

అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు



ఆర్మూర్‌టౌన్: విద్యారంగ సమస్యలపై పోరాడుతున్న పీడీఎస్‌యూ నాయకులను అక్రమ అరెస్టులతో ఆపలేరని సీపీఐ(ఎంఎల్) ప్రజపంథా రాష్ట్ర నాయకులు ప్రభాకర్, జిల్లా నాయకుడు దేవారం అన్నారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నరేందర్, జిల్లా కార్యదర్శి దుర్గా ప్రసాద్, ఆర్మూర్ ఏరియా అధ్యక్షుడు అనిల్‌లను అర్ధరాత్రి ఇళ్లపై దాడి చేసి వారిని అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని, అరెస్టు చేసిన నాయకులను బేషరతుగా విడుదల చేయాలన్నారు. విద్యా రంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. విద్యారంగాన్ని అభివృద్ధి చేయాలంటే కొఠారి కమిషన్ సిఫార్సులను అమలు చేయాలన్నారు. రానున్న రోజుల్లో విద్యార్థి లోకం తగిన బుద్ధి చెబుతుందన్నారు.

నిందితులను శిక్షించాలి



ఆర్మూర్: మోర్తాడ్ మండల కేంద్రంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ విగ్రహాన్ని తొలగించిన దుండగులను వెంటనే అరెస్టు చేయాలని ఆర్మూర్ డివిజన్ గౌడ సంఘం, మోర్తాడ్ గౌడ సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. ఆర్మూర్ ఆర్డీవో కార్యాలయానికి శుక్రవారం గౌడ కులస్తులు తరలివచ్చి అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాపన్నగౌడ్ విగ్రహాన్ని తొలగించిన చోటే మళ్లీ ఏర్పాటు చేయాలని, విగ్రహాన్ని తొలగించిన క్రేన్‌ను స్వాధీనం చేసుకుని సహకరించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలన్నారు. లేకపోతే ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. సంఘం సభ్యులు దేగాం యాదగౌడ్, లింబాగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, చక్రదర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంపై చిన్న చూపు



బోధన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యా రంగం పట్ల చిన్న చూపు చూస్తున్నాయని ఏఐఎస్‌బీ(ఆల్ ఇండియా స్టూడెంట్ బ్లాక్) రాష్ట్ర ప్రతినిధి నాగరాజు ఆరోపించారు. శుక్రవారం పట్టణ కేంద్రంలో నాయకులతో కలిసి మాట్లాడారు. బడ్జెట్‌లో విద్యారంగానికి అధిక నిధులు కేటాయించాలని, కొన్నేళ్ల నుంచి పోరాడుతున్నా ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి 30 శాతం నిధులు కేటాయించాలని, కేంద్ర ప్రభుత్వం 10 శాతమైనా నిధులు కేటాయించాలన్నారు. అరకొర నిధులతో విద్యార్థులకు సకాలంలో స్కాలర్‌షిప్‌లు రావడం లేదని వాపోయారు. నాయకులు రాజన్న, గంగా ప్రసాద్, శ్రీను, మహేష్, లక్ష్మణ్, వినోద్‌లు పాల్గొన్నారు.

భూములు అన్యాక్రాంతం కాకుండా చూడండి


తహసీల్దార్ రవీందర్‌కు వినతి పత్రం అందజేస్తున్న డొంకేశ్వర్ గ్రామ ప్రజలు

నందిపేట్(ఆర్మూర్): డొంకేశ్వర్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ పరిధిలోని భూములను అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరుతూ శుక్రవా రం తహసీల్దార్ రవీందర్ నాయక్‌కు గ్రామస్తులు వి నతి పత్రం అందజేశారు. గ్రామంలోని ఆబాది భూ ములను గుర్తించి కంచె ఏర్పాటు చేయాలని కోరారు. సర్పంచ్ చాయ చందు, ఎంపీటీసీ బైండ్ల శ్రీని వాస్, వీడీసీ ప్రతినిధులు , గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న డాక్టర్ మధుశేఖర్, వైద్యులు

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్ ప్రభుత్వ ఉన్నత తెలుగు మీడియం పాఠశాలలో ఈ నెల 5న చేయూత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత హెల్త్ శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సంస్థ వ్యవస్థాపకుడు డాక్టర్ మధుశేఖర్ తెలిపారు. పెర్కిట్ ఎంజే ఆస్పత్రిలో శుక్రవారం వైద్యులతో కలిసి డాక్టర్ మధుశేఖర్ మాట్లాడారు. ఆర్మూర్ ప్రాంత ప్రజలకు వైద్య సేవలందించాలనే సదుద్దేశంలో 2001లో చేయూత స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆనాటి నుంచి నేటి వరకు 41 సార్లు నిపుణులైన వైద్యులతో ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తూ వైద్య సేవలందిస్తున్నట్లు తెలిపారు. వైద్య శిబిరంలో మైనర్ శస్త్ర చికిత్సలతో పాటు వీలైతే పెద్ద శస్త్ర చికిత్సలను సైతం చేయనున్నట్లు తెలిపారు. తాము జన్మించిన ప్రాంతాల్లో ఆస్పత్రులు ఏర్పాటు చేసుకుని చేయూత స్వచ్ఛంద సంస్థ ద్వారా వైద్య సేవలందిచడం ఆనందంగా ఉందని వైద్యులు తెలిపారు. సమావేశంలో వైద్యులు లింగా రెడ్డి, వసంత కుమారి, ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ నాగరాజు, పీఆర్వో అమృతారెడ్డి, ముత్యం రెడ్డి, శేఖర్ రెడ్డి, అమర్, సాగర్, రాజేశ్ పాల్గొన్నారు.

'నిర్మాణాలకు అనుమతివ్వాలి'


ఆందోళన చేస్తున్న స్థల యజమానులు

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మార్కెట్ యార్డులో తమకు సంబంధించిన స్థలాల్లో నిర్మాణాలు చేపట్టడానికి అనుమతి ఇవ్వాలని కోరుతూ స్థల యజమానులు శుక్రవారం ఏఎంసీ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. స్థల యజమానులు మాట్లాడుతూ..1971లో అప్పటి పాలకవర్గం, మార్కెట్ కమిటీకి సంబంధించిన స్థలానికి వేలం పాట నిర్వహించారు. 61 మంది స్థలాలను దక్కించుకున్నారు. కొన్ని సంవత్సరాలుగా నిర్మాణాలు చేపట్టడానికి అనుమతి ఇవ్వాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్లాట్ల యజమానులు వాపోయారు. స్థల యజమానులు ప్రైవేట్ సర్వేయర్‌తో హద్దులు తెలుసుకునేందుకు ప్రయత్నించగా మార్కెట్ యార్డు సిబ్బంది అడ్డుకున్నారు. అధికారులు తమకు న్యాయం చేయకపోతే 2 రోజుల్లో మార్కెట్ కమిటీ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా చేపడతామని తెలిపారు.

నిరుపేదలకు 'డబుల్' కేటాయించండి


వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

ఆర్మూర్‌టౌన్: నిరుపేదలకు ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, ఖాళీ స్థలాలు ఉన్న వారికి రూ. 5 లక్షలు మంజూరు చేయాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంకటేష్ కోరారు. ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయం ఎదుట శుక్రవారం ప్రజా సంఘాల ఐక్యవేదిక పోరాట కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి అనంతరం ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ మనోహర్‌కు వినతి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్, పేదలకు డబుల్ బెడ్ రూం ఇళ్లు కట్టించి ఇస్తామని 8 ఏళ్ల నుంచి మభ్య పెడుతున్నారని విమర్శించారు. ఎస్ఎఫ్ఐ నాయకుడు సిద్ధాల నాగరాజు, వికలాంగుల ఐక్యవేదిక నాయకుడు కుల్దీప్ శర్మ, ఐద్వా నాయకురాలు సరస్వతి, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం..

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



బాల్కొండ: మండల కేంద్రంలో లింగమయ్య ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఆలయంలో నాగదేవత, గంగమ్మ, పార్వతి, నంది విగ్రహాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మల్లన్న ఉత్సవాలు ప్రారంభం..

మండల కేంద్రంలో మల్లన్న ఉత్సవాలను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ప్రతి సంవత్సరం మాఘ పూర్ణిమ సందర్భంగా మల్లన్న ఉత్సవాలు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామంలో మల్లన్నకు పల్లకీ సేవ నిర్వహించారు.

విరాట్ విశ్వ కర్మ జయంతి



బోధన్: విశ్వబ్రాహ్మణుల ఆరాధ్య దైవం విరాట్ విశ్వ కర్మ జయంతిని శుక్రవారం బోధన్‌లోని విశ్వబ్రాహ్మణ సంఘ భవనంలో వైభవంగా నిర్వహించారు. విరాట విశ్వ కర్మ చిత్ర పటానికి ప్రత్యేక పూజలు చేశారు. వేద మంత్రోచ్ఛరణల మధ్య మహాయజ్ఞం నిర్వహించారు. సంఘం పట్టణ అధ్యక్షులు కాళీదాస్‌చారి, ప్రతినిధులు అశోక్‌చారి, సతీష్‌చారి, రామదాస్‌చారి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం



ఎడపల్లి(బోధన్): జానకంపేట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా కల్యాణోత్సవాన్ని నిర్వహించడం ఇక్కడ ఆనవాయితీ. శుక్రవారం పుర ప్రముఖుల సమక్షంలో ఆలయ కమిటీ సభ్యులు స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. గ్రామ పెద్దలంతా పెళ్లి పెద్దలుగా వ్యవహరించి శ్రీ లక్ష్మీదేవిని నరసింహస్వామిని వేర్వేరుగా మేళ తాళాలతో పల్లకిలో ఊరేగించి కల్యాణ మండపానికి తీసుకువచ్చారు అనంతరం వీరి కల్యాణాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారి కల్యాణాన్ని వీక్షించడానికి ప్రజలు ఆలయానికి భారీగా తరలివచ్చారు. అనంతరం అన్నదానం చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ పురం సాయిలు, గ్రామ సర్పంచ్ పాట్లోళ్ల సాయిలు, ఎంపీటీసీ మంద సంజీవ్, తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన ఉర్సు


వెలవెలబోతున్న ఉన్న బడాపహాడ్ వీధులు

వర్ని: ప్రసిద్ధిగాంచిన బడాపహాడ్ ఉర్సు రెండో రోజు శుక్రవారం కొనసాగింది. దర్గాకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. సౌకర్యాలు లేకపోవడంతో దర్గా వద్ద ఉండకుండా దర్శనం చేసుకుని భక్తులు తిరిగి వెళ్లిపోయారు. ఉరుసుకు ఆశించిన మేర భక్తులు ఈ ఏడాది రాలేదు. బడాపహాడ్‌లో నిర్వాహకుల దోపిడీతో పాటు కనీస వసతులు లేకపోవడంతో భక్తులు ఉరుసుకు రావడానికి ఆసక్తి చూపలేదు.